సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



అంగన్‌వాడీల్లో పరేషన్

సకాలంలో సరకులు అందక అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థులు **చాలీచాలని ఆహారంతో, ఖాళీ కడుపులతో కాలం వెళ్లదీస్తున్నారు.** IIలో ▸



ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వసంతోత్సవం, చూర్ణోత్సవం, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు జరిగాయి. IIలో ▸



భార్యను కడతేర్చిన భర్త

అనుమానం పెనుభూతమై భార్యపై భర్త కత్తెరతో దాడి చేయగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఏలూరులో చోటుచేసుకుంది. IIలో ▸

న్యూస్‌రీల్

పుష్కర ఏర్పాట్లపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): 2027 గోదావరి పుష్కరాలకు శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి బడ్జెట్ రూపకల్పనపై ఆయా శాఖల అధికారులతో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. అభివృద్ధి పనులకు బడ్జెట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గోదావరి నదీ పరివాహక ప్రాంతానికి సంబంధించి పనుల నిర్వహణకు కన్జర్వెన్సీ శాఖలకు గుర్తించిన 42 పుష్కర ఘాట్లకు మరమ్మతులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లు, ఆలయాల మరమ్మతులు, మున్సిపాలిటీల్లో బీటీ రోడ్లు, డ్రెయిన్లు, ఏటుగట్టు సుందరీకరణ, నరసాపురం, పాలకొల్లు పట్టణంలో వసతి గృహాల మరమ్మతులు, స్వాగత ద్వారాలు, జనరేటర్లు, మెడికల్ క్యాంపులు తదితర వాటిపై సూచనలు ఇచ్చారు. డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీపీఓ రామ్‌నాథ్‌రెడ్డి, టూరిజం అధికారి ఏపీ అప్పారావు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉషారాణి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కె.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఎ.శ్రీనివాసరావు, నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొన్నారు.

5 కోట్ల సంతకాల సేకరణ లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి శీలం

భీమవరం: ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిందని, దేశవ్యాప్తంగా 5 కోట్ల మందితో సంతకాల సేకరణ లక్ష్యమని ఏపీ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గంలో సుమారు 16 వేల సంతకాల సేకరణ చేపడతున్నామన్నారు. బీజేపీ ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందని, ఓటర్ల జాబితాలో పలు అవకతవకలకు పాల్పడ్డారని, బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందని విమర్శించారు. త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఓడిపోవడం ఖాయమన్నారు. ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పాలక్ వర్మ, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, నరసాపురం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కేబీఆర్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, జిల్లా ఇన్‌చార్జ్ బైపూడి నాగేశ్వరావు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో 'ప్రజ్ఞ' మాసపత్రిక ఆవిష్కరణ



మాస పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీ 'ప్రజ్ఞ' పేరిట మాసపత్రికను ప్రారంభించింది. తొలి సంచికను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ గురువారం ఆవిష్కరించారు. విద్యార్థుల చైతన్యం, ప్రతిభ, నూతన ఆవిష్కరణలను ఇందులో ప్రతి నెలా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఐఐటీలలో ఇలాంటి మాసపత్రికలు ప్రచురితమవుతాయని, అలాంటి సంప్రదాయాన్ని ట్రిపుల్‌ఐటీలో కూడా పరిచయం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులే తమ పరిజ్ఞానంతో ఈ మాసపత్రికకు అంకురార్పణ చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, ఈఐటీపీ డీన్ శ్యాం, పాలనాధికారి లక్ష్మణరావు, అకడమిక్ డీన్ సాదు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యారోగ్య సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న దాదాపు 2,800 మంది డాక్టర్లు వారం రోజులుగా సమ్మె, నాలుగు రోజులుగా విజయవాడలో దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీరి సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్వేచ్ఛ బురిడీ



ఇదేమి పారిచోద్యం

- స్థానిక సంస్థల్లో పడకేసిన ప్రగతి
- గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం.. రోడ్లు అధ్వానం
- క్షేత్రస్థాయిలో కనిపించని చెత్తశుద్ధి
- వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చే యత్నం
- పారిశుద్ధ్యంపై ఐవీఆర్‌ఎస్ ఫోన్‌కాల్స్, స్వచ్ఛాంధ్ర అవార్డులు
- ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు నిధులివ్వని సర్కారు
- నిరుపయోగంగా సంపద కేంద్రాలు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు, ఐదు పట్టణాలు, ఒక నగర పంచాయతీ ఉన్నాయి. 70 శాతం గ్రామాలను డంపింగ్‌యార్డు సమస్య పీడిస్తోంది. చెత్త నుంచి సంపద తయారీకి గతంలోనే బృందావనాలు నిర్మించినా వినియోగానికి నోచుకోవడం లేదు. అక్టోబర్ 2 తర్వాత నుంచి రాష్ట్రం అంతటా ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్టు ఏడు నెలల క్రితం తణుకు పర్యటనలో ప్రకటించిన సీఎం చంద్రబాబు ఆ దిశగా ఇంకా కార్యాచరణ చేసిన దాఖలాలు లేవు.

నిధులేవీ ?

ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్)తో ప్రజాభిప్రాయ సేకరణ అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం అందుకు అవసరమైన సిబ్బంది నియామకానికి, సామగ్రి కొనుగోలుకు నిధులివ్వడం లేదని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ కోసం 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించాల్సి ఉండగా కొన్నిచోట్ల సగం మంది కూడా లేని పరిస్థితి. నెలకు రూ.10 వేలు జీతంపై గ్రీన్ అంబాసిడర్‌ను నియామకం చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుండగా, ఆదాయం లేక సిబ్బంది నియామకం చేసుకోలేని పంచాయతీలు ఎన్నో ఉన్నాయంటున్నారు.

ఏదీ స్వచ్ఛత.. ఎక్కడ సంపద

సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపంతో చెత్త నుంచి సంపద సృష్టి ప్రకటనలకే పరిమితమవుతోంది. చాలా పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. డంపింగ్ యార్డులు లేకపోవడం, బృందావనాలు వినియోగానికి నోచుకోక గ్రామాల్లో సేకరించిన చెత్తను కాలువగట్లు, రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడే డంప్ చేస్తున్నారు. గట్లపై వేసిన చెత్త కాలువల్లోకి చేరి నీటి కాలుష్యంతో పాటు పూడుకు పోయి సాగు, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. రోడ్ల పక్కన చెత్తకుప్పలతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అగచాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీల్లో రోడ్ల పక్కన వేసిన చెత్త కనిపించకుండా గ్రీన్ మ్యాట్‌లు కట్టి కవర్ చేస్తున్నా దుర్గంధం షరా మామూలే అవుతోంది.

మరమ్మతులు మూన్నాళ్ల ముచ్చటే

జిల్లాలో కూటమి ప్రభుత్వం రూ.42.57 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మూన్నాళ్ల ముచ్చటే అయ్యాయి. పల్లె పండగగా ఉపాధి హామీ నిధులు రూ.46.48 కోట్లతో అంతర్గత రహదారుల పనులు కూటమి నేతలు కావాల్సిన చోట్ల పెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వలంటీర్ల జాడలేదు. కొత్త పింఛన్ల మంజూరు లేదు. గృహనిర్మాణాలు ముందుకు సాగడంలేదు. రైతులకు ఎరువులు అందించలేని పరిస్థితి. పాలన వ్యవస్థలో ఎన్నో వైఫల్యాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారి దృష్టిని మరల్చేందుకే స్వచ్ఛ భారత్, ఐవీఆర్‌ఎస్ సర్వే అంటూ ప్రభుత్వం హడావుడి చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




పల్లె వ్యవస్థలు నిర్వీర్యం

ఈ చిత్రంలోని భవనాలను చూశారా? గ్రామ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రం పెనుగొండలో దాదాపు రూ.87 లక్షలు వెచ్చించి పక్కపక్కనే నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రం భవనాలివి. కొద్దిపాటి మైనర్ పనులు చేస్తే చాలు వినియోగంలోకి వచ్చే వీటిని పట్టించుకునే వారు లేక ఏడాదిన్నరగా ఇలా నిరుపయోగంగా ఉండిపోయాయి.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. పల్లె ప్రజలు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లెలకు చేర్చింది. వాటి కోసం సుమారు రూ.141.2 కోట్ల వ్యయంతో జిల్లాలో 353 సచివాలయ భవన నిర్మాణాలు, రూ.65 కోట్లతో 298 ఆర్‌బీకేలు, రూ.53.5 కోట్లతో 214 హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టింది. వీటిలో 270 సచివాలయాలు, 211 ఆర్‌బీకేలు, 96 హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తిచేసి అప్పట్లోనే వినియోగంలోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులివ్వక మిగిలిన భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

ఉండి మండలం వాండ్రం గ్రామంలో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కనిపించిన దృశ్యాలివి. చెత్త నుంచి సంపద తయారీకి నిర్మించిన తొట్టెలు వినియోగానికి నోచుకోక పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా వదిలేసి రోడ్డు పక్కనే చెత్త వేస్తున్న వైనాన్ని కళ్లకు కడుతున్నాయి. దారిన వెళ్లే ప్రజలు చెత్త నుంచి వస్తున్న దుర్గంధంతో తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోంది.



1



2

జిల్లా కేంద్రం భీమవరం హౌసింగ్‌బోర్డు ఏరియాలోని ఒక వీధిలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇళ్ల చెంతనే రోడ్డుపై పారుతున్న మురుగునీరు, పక్కనే ఉన్న చెత్తకుప్పలు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. కొన్నిచోట్ల మధ్యాహ్నం వరకూ చెత్త తీయరని కొందరంటుంటే, రెండు రోజులకోసారి తీస్తుంటారని మరికొందరు అంటున్నారు. ఇండస్ట్రియల్, టిడ్కో, బ్యాంక్ కాలనీ, హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు పూడికతో నిండి అధ్వానంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే రోడ్లపై చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

తాజాగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డులు అందుకున్న ఈ రెండు స్థానిక సంస్థల్లో పరిస్థితి ఇలా ఉంటే.. అవార్డులకు ఎంపిక కాని మిగిలిన పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

వృద్ధులను గౌరవించాలి



భీమవరంలో వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులకు చిన్ననాటి నుంచే వృద్ధులను గౌరవించడం నేర్పించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి ఫంక్షన్ హాల్‌లో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వృద్ధులకు ఏ సమస్య ఉన్న జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తల్లిదండ్రులు, వృద్ధులు పోషణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురు సంఘ నాయకులను కలెక్టర్ సత్కరించారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి కార్యదర్శి మెంటే పార్థసారథి, సీనియర్ సిటిజన్స్ ట్రి బ్యునల్ అధికారి దాయన సురేష్ చంద్రాజీ పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

ఇటీవల రాష్ట్రస్థాయి అవార్డు పొందిన వయోవృద్ధుల జిల్లా అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్‌ను కలెక్టర్ నాగరాణి సత్కరించారు.

పార్సిల్ వాహనాల్లో బాణసంచా తరలింపు నేరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పార్సిల్ సర్వీస్ వాహనాల్లో బాణసంచా, పేలుడు, విస్ఫోటన పదార్థాలు, నిషేధిత హానికారక స్వభావం కలిగిన వస్తువులను తరలిస్తే చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ హెచ్చరించారు. దీపావళి పండగ దృష్ట్యా గురువారం డీటీసీ కార్యాలయంలో ఏలూరులోని పార్సిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మందుగుండు సామగ్రి, విస్ఫోటన పదార్థాలు తదితర నిషేధిత వస్తువులను నిల్వ చేయడం, లారీల్లో తరలించడం నేరమని, ఉల్లంఘనలకు పాల్పడే పార్సిల్ సర్వీస్ సంస్థలపై క్యారేజ్ బై రోడ్ యాక్ట్ 2007, ఎంవీ యాక్ట్, సీఎంవీ రూల్స్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వాహన తనిఖీ అధికారులు వారికి నోటీసులు అందజేశారు. ఇన్‌చార్జి ఆర్టీఓ ఎస్‌బీ శేఖర్, వాహన తనిఖీ అధికారులు ఎండీ జమీర్, జి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ధ్యాస.. రోగుల ఘోష



ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కోసం వేచిచూస్తున్న రోగులు

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం అత్యవసర సేవలందించే వైద్యులను కూడా ప్రచార ఆర్భాటానికి వాడుకుంటోంది. సూపర్ జీఎస్టీ అవగాహన కార్యక్రమాలకు వైద్యులను వినియోగించుకోవడంతో పేదలకు వైద్యసేవలు దూరమవుతున్నాయి. ఆగిరిపల్లి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు సేవలందిస్తున్నారు. రోజూ ఆస్పత్రిలో 100 మంది వరకు ఓపీ చూపించుకుంటారు. గురువారం ఆగిరిపల్లిలో జరిగిన సూపర్ జీఎస్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. దీంతో ఉదయం కొందరు రోగులకు పీహెచ్‌సీలో వైద్యం అందించిన తర్వాత వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు జీఎస్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో పీహెచ్‌సీలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో రోగులు సుమారు 3 గంటల పాటు అవస్థలు పడ్డారు. డాక్టర్లను ఇలా ప్రచారానికి వాడుకోవడం ఏంటని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై డాక్టర్ జగన్‌మోహన్‌రావుని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నట్టు చెప్పారు.

గురువుల బోధనేతర బహిష్కరణ

- రోజురోజుకూ పెరుగుతున్న యాప్‌ల భారం
- నేటినుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ
- ఫ్యాప్టో పిలుపుతో నిలిచిపోనున్న ఆన్‌లైన్ వర్కులు



ఆన్‌లైన్ వర్కులు బహిష్కరిస్తున్నట్టు జిల్లా అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నేతలు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో బోధనేత పనులు చేయిస్తూ ఉపాధ్యాయ వృత్తినే కూటమి ప్రభుత్వం అవమానిస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఈనెల 10 నుంచి ప్రభుత్వ బడుల్లో బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం జిల్లాస్థాయి అధికారులకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో శుక్రవారం నుంచి అన్ని ప్రభుత్వ బడులు బోధనేతర పనులు బహిష్కరించి నిరసనలు తెలిపేలా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగ మూలాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. వాట్సాప్‌లో అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్‌లు, ఆన్‌లైన్‌లో పనులు, వెబెక్స్ మీటింగ్‌లతో రోజంతా బోధనకు దూరమవుతున్నట్టు వాపోతున్నారు.

బోధనేతన పనులతో నష్టాలు

కూటమి ప్రభుత్వంలో సర్కారీ బడులు అభ్యాస మందిరాలుగా కాకుండా డేటా సెంటర్లుగా మారుతున్నాయంటూ ఫ్యాప్టో నేతలు చెబుతున్నారు. బోధనేతర పనుల వల్ల రోజువారీ తరగతులు ఆలస్యం అవుతున్నాయి. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు సమయం తగ్గిపోతుంది. టీచర్స్‌లో బోధనాసక్తి కూడా క్రమంగా తగ్గిపోతుంది. టెక్నికల్ సమస్యలతో మానసిక ఒత్తిడిలో పడటం, నాణ్యతగల బోధన కంటే యాప్‌ల స్క్రీన్‌షాట్‌ల ప్రాముఖ్యతకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు.


పాఠశాలలు తెరిచిన నాటి నుంచీ..

ఈ ఏడాది జూన్ 12న పాఠశాల తెరిచిన నాటి నుంచి స్కూల్ ఆర్గనైజేషన్ టీములు, ఎంటీఎస్ బదిలీలు, కౌన్సెలింగ్‌లతో జూన్ నెల ముగిసింది. తర్వాత గిన్నిస్ రికార్డు పేరుతో యోగాంధ్ర ముందస్తు కార్యక్రమాలు, స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాలు తెచ్చుకుని అందించడం, బియ్యం లెక్కలు, మెగా పేరెంట్ మీటింగ్ 2.0కు పది రోజులు ముందుగా జూలై ముగిసింది. తర్వాత లీడర్‌షిప్, ప్రాథమిక అక్షరాస్యత, ఎఫ్‌ఎల్‌ఎన్ వంటి శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. నిత్యం సర్వర్ డౌన్‌తో టీచర్ ముఖ హాజరు నమోదుకు ఉదయం, సాయంత్రం ఆలస్యమవుతోంది. దీంతోపాటు విద్యాశక్తి కార్యక్రమం కొనసాగుతోంది. విద్యార్థులకు అందించే సన్నబియ్యం బస్తాలు ఓపెన్ చేసి క్యూఆర్‌కోడ్‌లు స్కానింగ్ నమోదు, ప్రతి బియ్యం బస్తా, చిక్కీలు, రాగి, బియ్యం, క్లీనింగ్ టూల్స్, ఐఎఫ్‌పీ ట్యాబ్‌లెట్స్ పంపిణీ వంటివి ఆన్‌లైన్ చేయడం, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలైన సూపర్ జీఎస్టీ ప్రచారాన్ని ఉపాధ్యాయులపై రుద్దడం దారుణమని ఆయా సంఘాల నాయకులు అంటున్నారు. ఈనెల 13 నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే సమయంలో ప్రభుత్వ ప్రచారాలకు ఉపాధ్యాయులను ఉపయోగించడం ఎంత వరకూ సబబు అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

బోధనేతర పనులు ఇలా..

- ఉదయం 9.20లోపు విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆయా అటెండెన్స్, ఐఎంఎంఎస్ యాప్‌లో ఇన్స్‌పెక్షన్ రిపోర్టు పూర్తి చేయడం, మధ్యాహ్నం 12 గంటలలోపు భోజన పథకానికి సంబంధించిన మెనూ లైవ్, ఫొటోలు, వీడియోలు పంపాలి.
- 2 గంటలలోపు మొక్కల రిజిస్ట్రేషన్ నమోదు.
- సాయంత్రం విట్‌నెస్ యాప్ అప్‌డేట్ చేయాలి.
- ఆపై టీఎంఎఫ్, లీప్ యాప్, ఎఫ్‌ఎల్‌ఎన్, టీపీడీఎస్, మైస్కూల్, డిజిటల్ అటెండెన్స్, లాంగ్వేజ్ మాపింగ్‌లు వంటి పనులు చేయాలి.
- ఇలా క్లాస్‌రూమ్‌లో సమయం బోధనకు కాకుండా స్కీన్‌లపై స్ట్రైపింగ్ చేయడానికే ఖర్చవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

దశల వారీగా ఆందోళనలు



ఈనెల 7న నిర్వహించిన ధర్నాలో బోధనేతర పనులు, ఆన్‌లైన్ యాప్‌లు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బోధనేతర పనులు రద్దుపై దశల వారీగా ఆందోళనలు పెరిగేలా ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరాటానికి ఉపాధ్యాయులు సిద్ధం కావాలి.

– పుప్పాల సూర్యప్రకాశరావు, జిల్లా ఫ్యాప్టో నాయకులు

బోధనకే పరిమితం చేయాలి



బడుల్లోకి సెల్‌ఫోన్ పట్టుకుని వెళ్లకుండా కేవలం పాఠాలు మాత్రమే పిల్లలకు చెబుతాం. ఫేషియల్ హాజరు కోసం ప్రభుత్వం పరికరాలు అందించాలి. బోధనా సమయం హరించేలా ఉపాధ్యాయులకు అప్పగిస్తున్న ఆన్‌లైన్ పనులతో సింగిల్ టీచర్ స్కూళ్లలో పరిస్థితి దారుణంగా ఉంది.

– షేక్ రంగావలి, జిల్లా ఫ్యాప్టో నాయకులు

అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పరేషన్

- ఇంకా చేరని నిత్యావసరాలు
- ఆన్‌లైన్ మార్పులతో ఆర్‌వోలు ఆలస్యం
- అప్పులు చేసి అంగన్‌వాడీల నిర్వహణ
- జిల్లాలో 2,226 అంగన్‌వాడీలు, 1,818 పాఠశాలల్లో అవస్థలు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కైకలూరు: కూటమి పాలనలో నిత్యవసరాల పంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోంది. సకాలంలో సరుకులు అందక అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థులు చాలీచాలని ఆహారంతో, ఖాళీ కడుపులతో కాలం వెళ్లదీస్తున్నారు. అక్టోబర్ నెల వచ్చి 10 రోజులు కావస్తున్నా ఇంకా అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు రేషన్ సరఫరా లేదు. ఆన్‌లైన్ సర్వర్‌లో మార్పులు ఆలస్యానికి కారణమని సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతోన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో నిల్వలు నిండుకోవడంతో రేషన్ దుకాణాలు చుట్టూ అంగన్‌వాడీ టీచర్లు తిరుగుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఏలూరు జిల్లాలో 2,226 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 48,563 మంది, 3వ సంవత్సరం నుంచి 6వ సంవత్సరం వరకు పిల్లలు 23,499 మంది, గర్భిణులు 8,861 మంది, బాలింతలు 6,592 మంది, యుక్తవయస్సు బాలికలు 21,498 మంది ఉన్నారు. అదే విధంగా జిల్లాలో 1,818 ప్రభుత్వ పాఠశాలల్లో 1,22,790 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం అంగన్‌వాడీలకు బియ్యం, కందిపప్పు, నూనె, పిండి, గుడ్లు, పాలు వంటివి సరఫరా చేయాల్సి ఉంది. సరుకుల ఆలస్యం వల్ల పదేపదే గర్భిణులు, బాలింతలు కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం పథకంలో పాత నిల్వలతోనే నిర్వాహకులు వంట చేస్తున్నారు.

కాంట్రాక్టర్ల గగ్గోలు..

ఏలూరు జిల్లాలో ఏలూరు, కైకలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, కోట రామచంద్రాపురం, పాతూరు, ధర్మాజీగూడెం, కుక్కునూరులో మండల లెవెల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్‌పీ) ఉన్నాయి. సెంట్రల్ వేర్ హౌస్ కార్పొరేషన్(సీడబ్ల్యూసీ) నుంచి సరకును స్టేజ్–1 కాంట్రాక్టర్లు ఎంఎల్ఎస్‌పీకి సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్‌పీ నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్–2 కాంట్రాక్టర్లు చేరవేస్తారు. వీరికి రెండు నెలలుపైబడి బిల్లులు రాలేదు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో ఉద్యోగులకు సైతం సకాలంలో జీతాలు రావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు నేరుగా సరుకుల సరఫరా చేస్తామని చెబుతున్నా అమలులో అది సాధ్యం కావడం లేదు. ఇదిలా ఉంటే 50 కేజీల బస్తాలలో ఇప్పటికే బియ్యం కొంత తగ్గుతున్నాయని రేషన్ డీలర్లు వాపోతున్నారు.


ఎల్‌ఎంఎస్ పాయింట్‌లో నిల్వలు

పట్టించుకోని ఇన్‌చార్జి మంత్రి

ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవహరిస్తున్నా జిల్లాలో సకాలంలో అంగన్‌వాడీలకు, పాఠశాలలకు సరుకుల మాత్రం చేరడం లేదు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం తూకంపై నిఘాను ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యపై కైకలూరు సివిల్ సప్లై డీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో స్టేట్, సెంట్రల్ రెండు సైట్‌లు ఉండేవని, రెండు సర్వర్లను కలిపి సింగిల్ విండోగా తీసుకొస్తున్నారని చెప్పారు. దీని వల్ల రిలీజ్ ఆర్డర్(ఆర్వో)ల సమస్య వచ్చిందన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కావచ్చని తెలిపారు.

పిల్లలను పస్తులుంచొద్దు



అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలు సొంత డబ్బులతో సరుకులు కొంటున్నారు. ఇప్పటి వరకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరుకుల సరఫరా చేయలేదు. నిత్యవసర సరుకుల కోసం పదేపదే కార్యకర్తలు డీలర్ల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి నెలా సమయానికి నిత్యవసరాలను సరఫరా చేయాలి.

– డీఎన్‌వీడీ.ప్రసాద్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు

సమస్య పరిష్కారానికి కృషి



అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యవసర సరుకుల పంపిణీ కొంత ఆలస్యమైన మాట వాస్తవమే. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకుంటున్నారు. సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది.

– పి.శారద, ఐసీడీఎస్, జిల్లా పీడీ, ఏలూరు

నేడు కార్తీక మాస ఏర్పాట్లపై సమీక్ష


క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 22 నుంచి కార్తీకమాసం పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ పూజా కార్యక్రమాలు నవంబర్ 20వ తేదీ వరకూ జరగనున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్నతాధికారులు భక్తులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. కార్తీకమాసంలో ఆలయానికి వచ్చే భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ఏడాదైనా భక్తులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ అనేక సత్రాలు ఉన్నాయి. ఈ సత్రాలను ఈ నెల రోజులు భక్తుల సౌకర్యార్థం ఉపయోగిస్తే బాగుంటుందని భక్తులు, హిందూ సంఘాల నాయకులు కోరుతున్నారు.

బస్సుల సమస్య తీరేనా?

అలాగే ఆలయానికి వచ్చే భక్తులను చిన్నకార్ల స్టాండ్ వద్ద దింపేసి బస్సులను శనివారం సంత మార్కెట్ రోడ్డు నుంచి మార్కెట్ యార్డులోకి తరలిస్తున్నారు. అయితే బస్సులు ఎక్కడ ఉన్నాయో? భక్తులు వెతుక్కునే పరిస్థితి ఉంటుంది. కాబట్టి చిన్నకార్ల స్టాండ్ నుంచి ఎన్టీఆర్ కళాక్షేత్రం వరకూ బస్‌లను దారి మళ్లించి ఆలయం రోడ్డు వద్ద భక్తులు దిగేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. అలాగే భక్తులు రామగుండం పార్కు నుంచి ఎన్టీఆర్ కళాక్షేత్రం ద్వారా ఆలయానికి చేరేలా మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి

కొయ్యలగూడెం: స్కూల్ బస్సు ఢీకొని నేపథ్యంలో బాలుడు మృతి చెందాడు. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడెం సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూలులో ఎల్‌కేజీ చదువుతున్న అబ్బు రిత్విక్ సాయి (4) బుధవారం స్కూల్ నుంచి బయటకు వస్తుండగా బస్సు డ్రైవర్ బస్సుని రివర్స్ చేస్తూ వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన రిత్విక్ సాయిని రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. బాలుడిది మంగపతిదేవిపేట గ్రామం. తండ్రి నాగరాజు, తల్లి శిరీషను వ్యవసాయ కూలీలుగా చేస్తుంటారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉండగా ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవల నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవలు అందించే పరిస్థితి లేదని, ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు మెయింటెనెన్స్ చేయడం చాలా భారంగా ఉందని స్థానిక శేషాద్రి హాస్పిటల్ డాక్టర్ గుణ్ణం నారాయణరావు తెలిపారు. ఈ మేరకు పాలకొల్లులో గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలుపుదల చేయనున్నట్టు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) తీర్మానం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి తమ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలుపుదల చేస్తున్నామని స్పష్టం చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు


స్వరూపా రాణి

ద్వారకాతిరుమల/దెందులూరు: శ్రీవారి క్షేత్రంలో ఒక మహిళ అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామానికి చెందిన ఆలపాటి స్వరూపా రాణి బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమలకు వచ్చింది. అయితే స్వరూపా రాణి ఆలయ ప్రాంగణంలో అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. స్వరూపారాణి ఆచూకీ తెలిసిన వారు 94407 96653 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ అధికారులు గురువారం పేరంపేట రోడ్డులో తనిఖీలు నిర్వహించగా హెడ్ పోస్టాఫీసు సమీపంలో ఓ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలించడాన్ని గుర్తించారన్నారు. ఈ వాహనంలో రూ.1.30 లక్షలు విలువైన 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీఎస్ డీటీ వెంకటేశ్వరరావు గుర్తించారు. జంగారెడ్డిగూడేనికి చెందిన కొత్తూరి బోస్, కొండూరి కాశీ ఫణికుమార్ (ఫణి), కొత్తూరి నాగేశ్వరరావు, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన కొడమంచిలి బుజ్జి, కోలా మణికంఠ కుమార్‌లపై సీఎస్ డీటీ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు

వాగులో కొట్టుకుపోయిన మహిళను కాపాడిన పోలీసులు


మహిళ అన్నామణితో పోలీసులు


ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు

బుట్టాయగూడెం: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షంతోపాటు ఎగువన కొండప్రాంతంలో కురిసిన వర్షాలకు తోడు జల్లేరు జలాశయం డ్యామ్ నుంచి అధికారులు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. గురువారం కూడా జైనవారిగూడెం–రెడ్డిగణపవరం మధ్య ఉన్న జల్లేరువారు వాగు ఉధృతంగా ప్రవహించింది. అయితే ఈ సమయంలో మండలంలోని జైనవారిగూడెంకు చెందిన ఇరపా అన్నామణి అనే గిరిజన మహిళ వాగుదాటే ప్రయత్నం చేస్తూ కొట్టుకుపోయింది. అయితే ఈ సమాచారం అందుకున్న గ్రామస్థులు తాటి రాముడు, తాటి రాంబాబు, సవలం యాకోబు, తదితరులు వాగు సమీపానికి చేరుకుని వాగు వెంబడి అన్నామణి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతూ కొంగవారిగూడెం ప్రాజెక్టు వరకూ వెళ్లారు. ఎక్కడా ఆమె ఆచూకీ లభించకపోవడంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై దుర్గా మహేశ్వరరావు, రైటర్ రాంప్రసాద్‌తోపాటు మరికొంత మంది పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకోవడంతోపాటు వారు కూడా గాలింపు చర్యలు చేపట్టారు. వాగు వెంబడి గాలింపు చర్యలు చేస్తున్న సమయంలో వాగుకు పైభాగంలో పనిచేస్తున్న కొవ్వాసు బాబూరావు అనే రైతు అన్నామణి వాగు వెంబడి కొమ్మలు పట్టుకుని ఉన్నట్లు చెప్పారు. దీంతో హుటాహుటిన గ్రామస్తులు, పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను బయటకు తీశారు. ఎస్సై అన్నామణిని ప్రశ్నించగా తన పిల్లలు మండలంలోని వెలుతురువారిగూడెంలో ఉండగా వారిని చూసేందుకు వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్లు చెప్పింది.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నేటి నుంచి ఆర్జిత సేవల పునరుద్ధరణ


క్షేత్ర పురవీధుల్లో భక్తులపై వసంతాలు చల్లుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు గురువారం జరిగిన పలు కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చనాది కార్యక్రమాలను జరిపి, హారతులిచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వసంతాలను సమర్పించి, చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారిని కీర్తిస్తూ అర్చకులు, మహిళా భక్తులు వద్దు దంచారు. ఆ తరువాత రాజాదిరాజ వాహనంపై శ్రీవారికి తిరువీధి సేవను నిర్వహించి, భక్తులపై వసంతాలు చల్లారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవాన్ని జరిపారు.

ద్వాదశ కోవెల ప్రదక్షిణలు ఇలా..

స్వామి, అమ్మవార్లకు రాత్రి ఆలయంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదనలు జరిపారు. ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవాకాలాన్ని నిర్వహించి, ఒక్కో రకం పిండి వంటను ఆరగింపుచేసి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. వీణా, వేణువు, మృదంగం, గానం, నృత్యం, శృతి, స్మృతి, ద్రవిడ వేదం, బేరి, కాహలము, గంటారావం, నిశ్శబ్దం వెరసి 12 సేవలు, 12 ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం జరిపిన శ్రీపుష్ప యాగోత్సవంలో అర్చకులు, పండితులు, భక్తులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే ఆలయ ముఖ మండపంలో స్వామివారు శయన మహావిష్ణువు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ వేడుకలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి ఆర్జిత సేవలు యథాతథం

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రద్దు చేసిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. భక్తులు గమనించాలని ఆయన కోరారు.


శయన మహావిష్ణువు అలంకారణలో శ్రీవారు


స్వామివారికి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు నిర్వహిస్తున్న దృశ్యం


స్వామివారి వాహనం ముందు కోలాటం చేస్తున్న యువతులు

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

మెషీన్ కుడుతున్న భార్యపై కత్తెరతో దాడి


హత్యకు గురైన నాగలక్ష్మి మృతదేహం

ఏలూరు టౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త కత్తెరతో ఆమెను కడతేర్చిన ఘటన ఏలూరు పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం సీతానగరం ప్రాంతానికి చెందిన కంతేటి నరేష్‌కు, నాగలక్ష్మి (34)కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. భర్త నరేష్ తాపీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నరేష్ తన కుటుంబంతో పాటు ఏలూరు శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంతానికి మకాం మార్చివేశాడు. భర్త నరేష్ ఏలూరులో కూడా తాపీ పనులు కొనసాగిస్తూ ఉండగా, భార్య నాగలక్ష్మి కొంతకాలం కర్రీ పాయింట్ పెట్టి, అనంతరం మెషీన్ కుడుతూ కుటుంబ పోషణలో భర్తకు తోడుగా ఉంటుంది. కానీ గత కొంత కాలంగా భర్త నరేష్ తన భార్య వేరొకరితో మాట్లాడుతుందని అనుమానం పెంచుకున్నాడు. ఇక అనుమానం కాస్త కక్షగా మారి ఇంటి వద్దనే మిషన్ కుడుతున్న భార్యపై ఆకస్మికంగా కత్తెరతో దాడి చేశాడు. అతి కిరాతకంగా మెడ, తలభాగాలపై పొడిచాడు. స్థానికులు గమనించి అతడిని నిలువరించి పట్టుకునే ప్రయత్నం చేయగా, తప్పించుకుని పారిపోయాడు. తీవ్ర గాయాలతో రక్తంలో పడి ఉన్న నాగలక్ష్మిని స్థానికులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. కొంతసేపటికే ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు పరిశీలించారు. నిందితుడు నరేష్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం సహకరించడం లేదు


ఎమ్మెల్యే పితాని ప్రసంగాన్ని అడ్డుకుంటున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌లు

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామాభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు సహకరించడం లేదని పెనుమంట్ర గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పెనుమంట్ర సచివాలయ ఆవరణలో 'పల్లె పల్లెకు మన పితాని' గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సర్పంచ్ ప్రియాంకను కించపరిచే విధంగా మాట్లాడడంతో వేదికపై ఉన్న సర్పంచ్ ప్రియాంక, ఉప సర్పంచ్ శ్రీనివాసరాజు ఒక్కసారిగా లేచి పితాని ప్రసంగానికి అడ్డు తగిలారు. గ్రామంలోని అధికారులు విద్యా కమిటీ సభ్యుల ఫోర్జరీ సంతకాలు చేసి, తప్పుడు తీర్మానాలతో ఇక్కడ పాఠశాలను విద్యార్థులకు దూరం చేశారని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎలగల బుల్లి రామిరెడ్డి, తహసీల్దార్ వైవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల బకాయిలు చెల్లించాలి


రుణాలు చెల్లించాలని లబ్ధిదారులను కోరుతున్న యూనియన్ బ్యాంకు అధికారులు

తాడేపల్లిగూడెం: బ్యాంకు రుణాలు ద్వారా టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారులు బకాయిలు వెంటనే చెల్లించాలని యూనియన్ బ్యాంకు అధికారులు ఎల్.అగ్రహారంలోని టిడ్కో లబ్ధిదారులను కోరారు. గురువారం ఉమ్మడి పశ్చిమకు చెందిన బ్యాంకు అధికారులు కాలనీని సందర్శించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా లబ్ధిదారులకు ఎంత బకాయిలు ఉన్నారు? పెండింగ్‌లు ఎంత ఉన్నాయనే విషయాలను వివరించారు. బకాయిలను ఎట్టి పరిస్థితుల్లో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించే స్థితిలో మేం లేమని లబ్ధిదారులు చెప్పారు. ఇళ్లకు ఎలాంటి సొమ్ము చెల్లించనక్కరలేదని గతంలో ఇళ్లు మాకు కేటాయించిన సందర్భంలో చెప్పారని, ఇప్పుడు బకాయిలు చెల్లించమంటే ఎలా అని ప్రశ్నించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రదీప్ మాలిక్, సీనియర్ మేనేజర్ భాస్కరరావు, మేనేజర్లు లోకేష్, చినబాబు, విజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


ఏసురాజు మృతదేహం

ముదినేపల్లి రూరల్: చేపల చెరువుపై విద్యుత్ మోటారు మరమ్మతులు చేస్తూ షాక్‌నకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొమ్మినంపాడులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం గోరింతోట గ్రామానికి చెందిన వలిగేటి ఏసురాజు(35) బొమ్మినంపాడులో 20 రోజుల కింద చేపల చెరువుపై కాపాలదారుగా చేరాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విద్యుత్ మోటారుతో నీరు తోడుతుండగా మధ్యంలో ఆగింది. దీనిని మరమ్మతులు చేస్తూ హఠాత్తుగా విద్యుత్ షాక్‌నకు గురై మరణించాడు. ఏసురాజు బంధువు దాసరి ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలోని బంగారు ఆభరణాల చోరీ

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని 15వ వార్డు చిన్నివారి వీధిలో నడిచివెళ్తున్న ఎస్.వెంకటరమణ అనే మహిళ మెడలోని బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడని పోలీసులు తెలిపారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశామని ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. దొంగ ఆచూకీ కోసం సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.

వార్డెన్ చర్యలపై విచారణ


బాలుర హాస్టల్‌లో విచారణ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూజే రాజశేఖరరెడ్డి

సాక్షి స్పందన

ఆకివీడు: విద్యార్థులపై అసభ్యకరంగానూ, అశ్లీల మాటలతో వేధిస్తున్నారనే విద్యార్థుల ఆరోపణల మేరకు స్థానిక ఎస్సీ హాస్టల్ వార్డెన్ పి.శ్రీధర్ పై గురువారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సాక్షిలో వచ్చిన వార్తకు స్పందించిన ఏఎస్‌డబ్ల్యూజే రాజశేఖరరెడ్డి హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడారు. దూషణలు, తదితర విషయాల్ని అడిగి తెలుసుకున్నారు. దీనిపై జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి నివేదిక సమర్పించి, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ప్రస్తుతం హాస్టల్‌కు ఇన్‌ఛార్జి వార్డెన్‌గా ఉండి వసతి గృహఅధికారిణిని నియమిస్తున్నట్లు విలేకరులకు తెలిపారు.

వివాహితపై లైంగిక దాడికి యత్నం

కైకలూరు: ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహితపై లైంగికదాడికి ప్రయత్నించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేశామని కైకలూరు రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం జంగంపాడు పల్లెపాలెంలో వడుగు దుర్గపై బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన కర్రి దుర్గారావు అనే వివాహితుడు లైంగికదాడికి యత్నించాడు. ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి అతను పరారయ్యాడు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- చెత్తతో 'తణుకు' చిత్తు...
- రోడ్లపైనే చెత్త కుప్పలు..
- మురుగుపారని డ్రెయినేజీలు..
- పందుల వీరవిహారం..

తణుకు అర్బన్: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ఆశయాలకు తూట్లు పొడిచేలా తణుకులో పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇంటి చెత్తను నేరుగా కంపోస్టు యార్డుకు పంపించే విధానానికి మంగళం పాడడంతో వీధివీధినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ఇంటి చెత్తను నేరుగా కంపోస్టుయార్డుకు చేర్చే క్లాప్ వాహనాలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్న చెత్తను ఒకచోట వేసి ట్రాక్టర్లు వచ్చేవరకు వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పాత పద్ధతిలో చెత్త కుండీల మాదిరిగా చెత్త డబ్బాలను నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. డబ్బాలో నిండిన చెత్త రోడ్డుపై పడిపోయి ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకు తోడు డ్రెయినేజీలు సైతం పూడికతో నిండిపోయి మురికి వాసనను వ్యాపింప జేస్తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఈ సమస్యలతో తణుకులోని 34 వార్డుల్లోను పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో ప్రజానీకం అల్లాడిపోతున్నారు. కొన్ని డ్రెయినేజీల్లో అయితే పిచ్చిమొక్కలు, గడ్డితో మూసుకుపోయి ఏడాదికాలంగా పట్టించుకోని దుస్థితిలో నెట్టుకురావాల్సిన దుస్థితి తణుకులో నెలకొంది. దీనికితోడు గతంలో లేని పందులు సైతం వీధుల్లో ప్రత్యక్షం కావడంతో ఆయా ప్రాంతాలు మురికికూపాలుగా మారిపోతున్న దుస్థితి.


తణుకు కట్టమూరి వారివీధిలో రోడ్డుపైనే చెత్త

219.96 కిలో మీటర్ల మేర డ్రెయినేజీ వ్యవస్థ..

తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లో సుమారుగా 1,20 లక్షకుపైగా జనాభా ఉండగా 219.96 కిలోమీటర్ల మేర డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. అయితే ప్రధాన డ్రెయినేజీల్లో కొంతమేర పర్యవేక్షణ ఉన్నప్పటికీ వీధుల్లో ఉన్న డ్రెయినేజీలను శానిటరీ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. చెత్తకు సంబంధించి నిత్యం 50 టన్నులకుపైగా చెత్తను సేకరించి కంపోస్టుయార్డుకు తరలించాల్సి ఉంది. పట్టణ విస్తీర్ణం పెరిగినప్పటికీ తగిన విధంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించలేకపోవడంతో ఉన్న కార్మికులపై తీవ్ర భారం పడుతుందని కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం 165 మంది కార్మికులు ఉండగా ఇద్దరు శానిటరీ ఇనస్పెక్టర్లు, 9 మంది శానిటరీ మేస్త్రిలు పర్యవేక్షణ చేస్తున్నారు.

స్వచ్ఛాంధ్ర పారామీటర్స్‌లో వెనకడుగు...

స్వచ్ఛాంధ్ర పారామీటర్లు పాటించలేకపోవడంతో తణుకు మునిసిపాలిటీ శానిటరీ విభాగం డీలా పడింది. చెత్తను బయటపారవేయవద్దని శానిటరీ విభాగం సూచనలు చేస్తున్నా, సేకరణలో జాప్యం, తదితర కారణాలతో కొన్ని వీధుల్లో చెత్త రోడ్డుపైనే కనిపిస్తోంది. దీనికితోడు శానిటరీ అధికారులే స్వయంగా చెత్త పాయింట్‌లు ఏర్పాటు చేసి ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పాయింట్‌లలో వేయిస్తుండడం కూడా పట్టణంలో చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చిందని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. సమయానికి వచ్చి చెత్త సేకరిస్తే మాకు బయట పారవేయాల్సిన పరిస్థితి ఎందుకొస్తుందంటూ ప్రజలు సైతం పారిశుద్ధ్య కార్మికులను నిలదీస్తున్నారు.


తణుకు రామభద్ర కాంప్లెక్స్ వద్ద మురుగుతో నిండిఉన్న డ్రెయినేజీ

గూడెంలో కదలని డ్రెయిన్లు, వదలని చెత్త

ఇదీ గూడెంలో పారిశుద్ధ్య పరిస్థితి

తాడేపల్లిగూడెం: నెలలో ఒక శనివారం రాగానే హంగామా చేస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు. ఆడియో, వీడియో హంగామాలు. దృశ్య చిత్రమాలికల్లా ఫోటోలకు ఫోజులు. ఇదంతా చూసి, తెల్లారేసరికి పట్టణంలోని 35 వార్డులు అద్దంగా మారినట్టు. ఆడవాళ్లు ఇళ్లల్లో దర్పణాలు వదిలి తమ ముఖారవిందాలు ఇక మునిసిపల్ రోడ్లపైనే చూసుకున్నట్టు స్వప్నంలోకి వెళతారు. ఈ లోగా ఏదో ఫిలిస్ దోమ కుట్టగానే స్పృహలోకి వస్తారు. అప్పటికే ఒంటినిండా వాలిన దోమలు. ముక్కుపుటాలు అదిరేలా ఘాటైన వాసన చిందించే డ్రెయిన్లలో ఆనకట్ట మాదిరిగా కనిపిస్తున్న చెత్తా చెదారాలు. ఖాళీ స్థలాల్లో చేరిన మురికి నీరు. వాటిపై విహారం చేస్తున్న లార్వాలు సుందర దృశ్య రూపంగా కనిపించగానే, స్వప్నంలో పట్టిన మబ్బు తెరలు ఒక్కొక్కటికిగా విడిపోతాయి. మా భ్రమ కాని, పన్నులు చెల్లించినా, పట్టణం దోమల, దుమ్ము గూడెంగా మూటగట్టుకున్న ఖ్యాతి నుంచి తప్పించుకోదేమో అన్న విషయం అవగతమవుతుంది. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, పైగా దీనికి అవార్డులు అంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఏం చూసి మునిసిపాలిటీ పరిధిలో ఇద్దరికి రాష్ట్ర , జిల్లాస్థాయిలో రెండు అవార్డులు దక్కాయి. వేటిని ప్రామాణికంగా తీసుకొని ఈ అవార్డులు ప్రకటించారో మేధావులకు కాని అర్థం కాదు. పట్టణంలో పరిస్థితి ఎక్కడ చూసినా పారిశుద్ధ్య ఫలితాలు కనిపించడంలేదు. వాస్తవం దోమల ఖజానా, ప్రజలకు నజరానా అన్నట్టుగానే ఉంది. తాడేపల్లిగూడెం పట్టణంలో పరిస్థితి పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కుట్టికుట్టి చంపుతున్నాయి. పట్టణంలో లక్షా పైచిలుకు జనాభా. పట్టణంలో ఉన్న 27 వేల 192 కుటుంబాలు తమ ఇంటి బడ్జెట్‌లో దోమల నివారణకు ప్రత్యేక కేటాయింపులు చేస్తున్నారు. కుటుంబానికి రోజుకు సరాసరిన పది రూపాయల వంతున నెలకు 300 రూపాయలు. సాలుకు 3,600 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే పట్టణంలో ఉన్న కుటుంబాలు దోమల కోసం చేస్తున్న ఖర్చు తొమ్మిది కోట్ల 78 లక్షల91 వేల రెండు వందల రూపాయలు ఇది దోమల నివారణకు వాడే అగర బత్తి, కాయిల్స్, మేట్స్, లిక్విడ్స్, పేపర్స్ వంటి వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. వీటికి దోమలు కుట్టడం వల్ల సంక్రమించే వ్యాధులు తగ్గించుకోడానికి వైద్యానికి చేసేది అదనపు ఖర్చు కలుపుకుంటే ఇంకా పెరుగుతుంది. పట్టణంలో ఉన్న 35 వార్డులలో ఖాళీ జాగాలు అధికంగా ఉండటం. వాననీరు సక్రమంగా వెళ్లే మార్గాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో డ్రెయిన్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు. కొబ్బరి బొండాలు దోమల ఉత్పత్తికి కేరాఫ్‌గా మారింది.


దోమల ఉత్పత్తి కేంద్రాలు ఇవే


డ్రెయిన్లలో ఎక్కడి చెత్త అక్కడే

పట్టణంలో ఉన్న వార్డులు	- 35
పట్టణ జనాభా	- 1,03,577
పట్టణ విస్తీర్ణం	- 20.71 చదరపు కిలో మీటర్లు
పట్టణంలో కుటుంబాలు	- 27,192
మురికి వాడలు	- 42
మురికి వాడలలో జనాభా	- 44, 825
రోజూ పట్టణంలో వచ్చే చెత్త	- 80టన్నులు
శానిటేషన్ కాంట్రాక్టు కార్మికులు	- 192
పర్మినెంటు శానిటరీ కార్మికులు	- 91
ఏడాదికి వీరికి ఇచ్చే జీతాలు	- సుమారు 3 కోట్ల 49 లక్షల 920

దోమల నివారణ , ఇతర పారిశుద్ధ్య పరిస్థితులకోసం చేసే ఖర్చు- సుమారు 80 లక్షల నుంచి కోటి రూపాయలు. పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన స్థితిలో ఉన్నా, అవార్డులు ఎందుకు ఇస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టడానికే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న స్పిరిట్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. స్థానిక జీఎంఆర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్పిరిట్ అధ్యక్షుడు పెదప్రోలు వెంకటాచార్యులు (భాస్కర్) అధ్యక్షతన మానసిక ఆరోగ్యం, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరుతూ గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. స్నేహమైండ్ న్యూరో సైకియాట్రిస్ట్ వైద్యులు పృథ్వీరాజ్, స్నేహితలు పర్యవేక్షించారు. క్లబ్ సభ్యులు కేతల మణికంఠ, బత్తుల ప్రసాద్, వట్టిప్రోలు రాము, కళాశాల కరస్పాండెంట లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీనవార్, రాజా త్రినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అప్పలస్వామి


టి.అప్పలస్వామి

తణుకు అర్బన్: ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) నూతన కమిటీలో తణుకుకు చెందిన టి.అప్పలస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏఐఎస్‌ఏ ఆధ్వర్యాన విజయవాడలో గురువారం ఎంబీకే భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో నూతన కమిటీ ఎన్నికలో తనకు ఈ గౌరవం దక్కినట్లు ప్రస్తుత జిల్లా కార్యదర్శి అప్పలస్వామి తెలిపారు. 19 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఇందులో రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా ఎనిమిది మందిని ఎన్నుకున్నారని వివరించారు.

ఎన్‌ఎంయూఏ నిరసన


తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

తణుకు అర్బన్: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) ఆధ్వర్యంలో తణుకు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బస్టాండ్ ఆవరణలో గురువారం నిరసన తెలిపారు. ముఖ్యంగా కొత్తగా పెట్టిన హార్డ్ డ్యూటీ రెస్టాఫ్ సర్వీస్‌లతోపాటు డిపోకి చెందిన డ్రైవర్ రామారావుపై అక్రమ సస్పెన్షన్ కేసు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. రెండురోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమంలో భాగంగా రెడ్ బ్యాడ్జిలు ధరించి నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆఫ్రికా నత్తల నివారణపై దృష్టి పెడుతున్నాం

తాడేపల్లిగూడెం: ఉభయ గోదావరి జిల్లాల్లో అన్ని పంటలను ఆశించి రైతులను ఆందోళనకు గురి చేస్తున్న ఆఫ్రికా నత్తల నివారణ విషయంలో ఉద్యాన శాస్త్రవేత్తలు రైతులకు మార్గదర్శకంగా ఉంటారని ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు గోవిందరాజులు అన్నారు. గురువారం వెంకట్రామన్న గూడెంలోని కెవికె లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆఫ్రికా నత్తలు ఇక్కడ కనిపించే నత్తల కన్నా పెద్దవని, వాటి నివారణకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఉద్యానవర్సిటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన కరపత్రాలను రైతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: కారును అడ్డగించి రాళ్లతో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండ్రుప్రోలు గ్రామానికి చెందిన జానా నాగరాజు అతని స్నేహితుడు అడపా ప్రసాద్‌కు తెలిసిన వారి వివాహం నిమిత్తం నందమూరు వెళ్లి తిరిగి బుధవారం రాత్రి కారులో వస్తుండగా ఆరుళ్ళ- నవాబుపాలెం మధ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి వారి కారు వెనుక వైపు అద్దం పగులకొట్టి నాగరాజు జేబులోని సొమ్ములను బలవంతంగా లాక్కుని పారిపోయే ప్రయత్నం చేశాడు. అయితే, నవాబుపాలెం గ్రామస్తులు అతనిని పట్టుకుని చూడగా నిడదవోలుకు చెందిన మద్దా మహేష్‌గా గుర్తించారు. జానా నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ముగిసిందనడం సరికాదు

తాడేపల్లిగూడెం (టీటీసీ): మంద కృష్ణ మాట్లాడుతున్న మాటలు ప్రజాస్వామ్యంనకు సిగ్గు చేటు అని మంగరాజు ఎద్దేవా చేశారు. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ముగిసిపోయిందనడం సరికాదన్నారు. ఏపీలోను, తెలంగాణలోను ఎస్సీ వర్గీకరణ వల్ల 58 కులాలకు గత ఐదు నెలలుగా ఎటువంటి అవకాశాలు లేవని, వారు నష్టపోతున్నారని కనబడటం లేదా అని ప్రశ్నించారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థులు తప్పక క్రీడల ప్రాధాన్యత గుర్తించాలని, చదువులతో పాటు క్రీడలలో కూడా రాణించాలని ఎంఈఓలు వి.హనుమ, జ్యోతిలు పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి సెలక్షన్స్ గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓలు సెలక్షన్స్‌ను ప్రారంభించారు. ఈ సెలక్షన్స్ 7 విభాగాల్లో అండర్ 14, అండర్- 17 బాల బాలికలకు ఈ పోటీలు జరిగాయి. మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, చెస్, యోగాలో ఎంపికలు జరిగాయి. మండలంలోని 14 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 6 మునిసిపల్ హై స్కూల్స్, 3 సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, 6 ప్రైవేట్ స్కూల్స్ నుంచి సుమారు 540 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్‌ను క్రీడా శ్రీలు ఎ.ఈశ్వర్ శ్రీనివాస్, మండల పీడీలు, పీఈటీలు సహకారంతో నిర్వహించారు. 10వ తేదీ శుక్రవారం వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలకు పోటీలు జరుగుతాయన్నారు.


మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎంఈఓలు హనుమ, జ్యోతి, పీఈటీలు తదితరులు

మానసిక దృఢత్వమే శారీరక ఆరోగ్యం

తణుకు అర్బన్: మానసికంగా దృఢంగా ఉంటేనే శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని సీనియర్ మానసిక వైద్యులు డాక్టర్ బి.రమేష్‌కుమార్ అన్నారు. మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్, మానస హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రగతి కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో మానవ తెలివితేటలు ఆకాశాన్నంటుతూ మనుగడకు అవసరమైన సౌకర్యాలు అందుకుంటున్నప్పటికీ మానసికంగా మనిషి జీవితం సమస్యల వలయంలో చిక్కుకుపోతుందని స్పష్టం చేశారు. సరైన ప్రణాళికలు లేకపోవడంతో ఒత్తిడికిలోనై మానవ జీవితం మానసిక సమస్యలతో ఒంటరిగా భావించి ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తుందని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప లేని ఇబ్బందులు కొని తెచ్చుకోకూడదని హితవు పలికారు. కళాశాల డైరెక్టర్ ప్రగతి రాజా అధ్యక్షతన నిర్వహించిన సీనియర్ వైద్యులు సుంకవల్లి రామకృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ కుమార్

17న తణుకులో జిల్లా యువజనోత్సవాలు

తణుకు అర్బన్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ఆవరణలో జిల్లా యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వార్షిక ప్రణాళికలను అనుసరించి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ యువజనోత్సవాలు తోడ్పడతాయని వివరించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారని, రాష్ట్రస్థాయిలో విజేతలైనవారు జాతీయస్థాయికి అర్హత సాధిస్తారని చెప్పారు. 15 నుంచి 29 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు అర్హులని, పాల్గొనేవారు తమ సొంత ఖర్చులతో హాజరుకావాలని, వాయిద్యం, అలంకరణ, దుస్తులు అభ్యర్థులే సమకూర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అదేరోజు స్పాట్ రిజిస్ట్రేషన్ చేస్తామని, ఆసక్తికల విద్యార్థులు తెలుగు అధ్యాపకులు పి.శివప్రసాద్ 94904 60091 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి - లక్ష్యాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు కొనసాగాయి. గురువారం పెంటపాడు, తణుకు మండలాలకు చెందిన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ఎంవోటీలుగా పవన్, కే.మార్రాజు వ్యవహరించారు. తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచ్‌లకు అవగాహన ఉండాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు ఎం.వెంకటేష్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు

300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ఇరగవరం: మండలంలోని తూర్పువిప్పర్రు గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వారిచే అడ్డగర్ల అమ్మిరాజు జ్ఞాపకార్థం సజ్జపురం లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మంది విద్యార్థులకు దృష్టి లోపం గుర్తించి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, డివోటి డాక్టర్ హరిచందన, అధ్యక్షుడు ఎ రాజు, సెక్రటరీ అడ్డగర్ల వెంకటేశ్వరరావు, ట్రెజరర్ రాజేష్, సీనియర్ సభ్యులు విజయ శ్రీ, బైలా లక్ష్మీ, నారాయణ, పుట్టా రామచంద్రరావు, గ్రామ సర్పంచ్ టి సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ జె ఎస్ మూర్తి పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


తూర్పువిప్పర్రులో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కూచిపూడిలో సత్తా చాటిన అంబికా డ్యాన్స్ విద్యార్థినులు

తణుకు అర్బన్: తణుకుకు చెందిన అంబిక డాన్స్ అకాడమీ విద్యార్థినులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన కూచిపూడి సర్టిఫికెట్, డిప్లొమా పరీక్షల్లో మంచి ప్రతిభ చూపినట్లు అకాడమీ గురువులు జేవైఎన్ అంబిక, పి.శిరీష తెలిపారు. సర్టిఫికెట్ కోర్సుల్లో బి.గోపిక, జి.శివాని డిస్టింక్షన్ సాధించారని, కె.ప్రసన్న, ఎన్.సిరి, ఆర్.ఓ్యతిర్మయి, ఆర్.అన్నయ్య, ఉ.యామిని ఫస్ట్‌క్లాస్‌లోను, సెకండ్‌క్లాస్‌లో ఎన్.వర్షిక నిలిచారని, డిప్లొమా ఫలితాల్లో ఫస్ట్ క్లాస్‌లో జి.వైష్ణవి, టి.మృణాళిని, బి.సుదర్శిని సాధించారని వివరించారు.

చేగువేరాకు ఘన నివాళులు

తణుకు అర్బన్: ప్రపంచ సోషలిస్టు విప్లవ భావాల సంస్కృతికి చిహ్నం చేగువేరా అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సోషలిస్టు విప్లవ కారుడు చేగువేరా 58 వర్ధంతి సందర్భంగా గురువారం తణుకు సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఆకలి, పేదరికం లేని సమసమాజ స్థాపనకు చేగువేరా చిన్న వయస్సులోనే సోషలిస్టు విప్లవ కారుడుగా మారాడన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ సమితి సభ్యులు గారా ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు, నూనె రాధాకృష్ణ చేగువేరాకు నివాళులర్పించారు.


తణుకులో చేగువేరా చిత్రపటం వద్ద నినదిస్తున్న భీమారావు తదితరులు.

ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో..

చేగువేరా జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి అన్నారు. చేగువేరా 58 వ వర్ధంతి సందర్భంగా తణుకు ఎస్సీఐఎం పభుత్వ డిగ్రీ కళాశాల కూడలిలో గురువారం చేగువేరా చిత్రపటానికి విద్యార్థి సంఘం నాయకులు చిలకా నాగరాజు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పి.ప్రేమ్, వి అభిషేక్, కె.రాజు, జి.కార్తీక్, ఎ.వేమన్న, టి.అంజలి, జి.కీర్తి, కె.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద బాలిక చదువుకు ఆర్థిక సాయం


రూ.25 వేలు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వడ్డి రఘురాం

పెంటపాడు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం పేద బాలిక పోతంశెట్టి రూపకు విద్య నిమిత్తం రూ.25 వేలు సాయంగా అందించారు. బుధవారం రాత్రి తన ఇంటి వద్ద ఆ బాలికకు ఆ మొత్తాన్ని అందజేశారు. బాలిక స్వగ్రామం పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం. ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత విద్యకు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లి జయశ్రీ అనారోగ్య కారణాలు అడ్డుగా రావడంతో స్థానిక రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ గ్రూపును ఆమె సాయం కోరింది. ఆ గ్రూపులో సభ్యుడిగా ఉన్న వడ్డి రఘురాం తక్షణం స్పందించి బాలికకు సాయం అందించారు. ఆర్థిక, అనారోగ్య కారణాల వల్ల చదువు ఆపవద్దని, సాయం కోసం తనను సంప్రదించాలని సూచించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు వడ్డి రఘురాంకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): కంటి సమస్యల పట్ల అశ్రద్ధ వహించరాదని, కంటి సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే వైద్యుడిని సంప్రదించాలని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. పట్టణంలో గురువారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో సుబ్బలక్ష్మి, సరోజిని, సుజాత వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి


దువ్వలో బాణసంచా సామగ్రి దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

తణుకు అర్బన్: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా సామగ్రి దుకాణాల వద్ద దుకాణదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. తణుకు రూరల్ పరిధిలోని దువ్వ గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రి దుకాణాలను వారు పర్యవేక్షించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ప్రమాద నివారణకు ఉంచాల్సిన నివారణ సామగ్రిని కూడా అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపు చేయాలనే విషయాలను అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై చంద్రశేఖర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక శక్తిని పెంచేందుకు ధ్యానం తప్పని సరి

తాడేపల్లిగూడెం (టీటీసీ): మానసిక శక్తిని పెంచేందుకు ధ్యానం తపని సరి అని లయన్స్ కరిబండి రామకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం అంశంపై హెల్త్ అవగాహన కార్యక్రమం గురువారం స్థానిక ఉమర్ ఆలీషా ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగింది. కరిబండి రామకృష్ణచే ధ్యాన ప్రక్రియలను అవగాహన కల్పించారు. యాంత్రిక యుగంలో మానసికంగా చాలా ఒత్తిడి ఉంటుందని, మనస్సును కంట్రోల్ చేసుకోవాలన్నారు.